www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 26 మే 2025
5
తిరుపతి



తిరుమలలో త్వరలో ఏఐ సేవలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: శ్రీవారి ఆలయాన్ని నిర్వహించే తిరుమల తిరుపతి దేవస్థానము (టీటీడీ) ఏఐ టెక్నాలజీని వినియోగించనుంది. భక్తుల దర్శన అనుభవాన్ని మెరుగుపరిచేందుకు అత్యాధునిక టెక్నాలజీలను ప్రవేశపెట్టనుందని టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) జె. శ్యామలారావు తెలియజేశారు. ఈవో వెల్లడించిన వివరాల ప్రకారం, ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత విధానాలను ఉపయోగించి భక్తులను ధృవీకరించనున్నారు. దాంతో పాటు, దొంగ పాస్‌లను, భక్తుల పేర్లను వాడి జరిగే మోసాలను నిరోధించడమే లక్ష్యంగా టీటీడీ ఈ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మార్కెట్లో అందుబాటులో ఉన్న అత్యుత్తమ టెక్నాలజీ పరిష్కారాలను, ముఖ్యంగా ఏఐ ఆధారిత వ్యవస్థలను ఉపయోగించి భక్తుల యాత్రను మరింత సులభతరం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ టెక్నాలజీని అమలు చేయడం ద్వారా భక్తులకు సమయానుకూల దర్శన టోకెన్లు జారీ చేయబడతాయని, ప్రతి భక్తుని ముఖ చిత్రం తీసి, గత 30 రోజుల్లో సేకరించిన దాదాపు 10 లక్షల చిత్రాలతో అనుసంధానం చేసి, నకిలీ బుకింగ్‌లను అడ్డుకుంటామని తెలిపారు. ఈ విధానంలో టోకెన్ జారీ, ధృవీకరణ ప్రక్రియ వేగంగా, సమస్యలులేకుండా పూర్తవుతుందన్నారు. దీంతో నకిలీ టిక్కెట్లు, బుకింగ్ మోసాలకు పూర్తిగా చెక్ పడనుందన్నారు. ముఖ గుర్తింపు టెక్నాలజీని క్యూ లైన్లు, కంపార్ట్‌మెంట్లు, ఆలయ అంతర్గత ప్రాంతాల్లో భక్తుల సంఖ్యను గమనించడానికి కూడా ఉపయోగిస్తామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలు భక్తుల కదలికలను రియల్ టైంలో గుర్తించి, దర్శన సమయాన్ని అంచనా వేసేందుకు సహాయపడతాయని తెలిపారు. ఈ విధానం ద్వారా భక్తులు క్యూ లైన్‌లో చేరినప్పుడు తగిన సమాచారం పొందవచ్చన్నారు. భక్తులు తమ యాత్రను ముందస్తుగా ప్లాన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ కెమెరాల ద్వారా దర్శన మార్గాల్లో అనవసర ఖాళీలు లేదా ఆపరేషనల్ లోపాలను గుర్తించి సరిచేయవచ్చని తెలిపారు. భవిష్యత్‌లో తిరుమలలో చొరబాటుదారులను గుర్తించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ కీలకంగా ఉపయోగపడనుందని తెలిపారు. మొత్తంగా, శ్రీవారి భక్తుల సేవల్లో పారదర్శకత, సమర్థత, భద్రతను పెంచే లక్ష్యంతో ఈ టెక్నాలజీని అన్ని విభాగాల్లో విస్తరించనుంది.

దర్శనానికి పోటెత్తిన భక్తులు

శనివారం 90,211 మందికి శ్రీవారి దర్శనం

ప్రజాశక్తి - తిరుమల: వేసవి సెలవుల నేపథ్యంలో వారం రోజులుగా తిరుమలలో భక్తుల తాకిడి పెరిగింది. ఈ క్రమంలో అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. వైకుంఠం కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, బయట క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల కోసం టీటీడీ నిరంతరాయంగా అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ ఏర్పాట్లను విస్తృతంగా చేపట్టింది. టీటీడీ యంత్రాంగం కృషితో శనివారం రోజున 90,211 మంది భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం కలిగింది. ఆరోగ్య శాఖ సిబ్బంది, శ్రీవారి సేవకుల సమన్వయంతో భక్తులకు సేవలందిస్తున్నారు.

కొత్త ఇంట్లోకి సీఎం కుటుంబం

వైభవంగా చంద్రబాబు గృహప్రవేశం.. తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలు
ఐదు గంటల పాటు ప్రత్యేక పూజలో ముఖ్యమంత్రి







ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండలం, శివపురం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన గృహప్రవేశం వైభవంగా జరిగింది. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు గృహప్రవేశ పూజా కార్యక్రమాలు జరిగాయి. మంగళ వాయిద్యాలు వేద పండితుల వేదమంత్ర అర్చనలతో నూతన గృహంలోకి ప్రవేశించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్వహించి గోవులకు పూజలు చేశారు. పూజ తరువాత ముఖ్యమంత్రి కోడలు బ్రాహ్మిణి పొయ్యిపై పాలు పొంగించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు సంప్రదాయపద్ధతిలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు ముగించుకున్న అనంతరం ఉదయం 10 గంటలకు టీడీపీ కుటుంబ సభ్యులు, ప్రజలు చంద్రబాబు దంపతులకు శుభాకంక్షలు తెలిపారు. ఈ శుభ కార్యక్రమానికి వచ్చే వారందరికీ పసందైన పలు రకాల విందు వంటకాలూ సిద్ధం చేశారు. కుప్పంలోని కొత్త ఇంటి గృహ ప్రవేశం నేపథ్యంలో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులందరూ శనివారం రాత్రికే కుప్పం చేరుకున్నారు. చంద్రబాబు తరఫున ఆహ్వానాలు అందుకున్న నియోజకవర్గ ప్రజలు, టీడీపీ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

పసందైన వంటకాలు..

శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ పరిధిలోని శివపురం వద్ద రెండెకరాల స్థలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన గృహాన్ని నిర్మించుకున్నారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శనివారం మధ్యాహ్నమే కుప్పం చేరుకుని పీఈఎస్ వైద్య కళాశాల అతిథి గృహంలో బస చేశారు. నూతన గృహానికి వెళ్లి, అక్కడి గృహప్రవేశ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో కుప్పం చేరుకున్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధరాత్రి తర్వాత కుప్పం వచ్చారు. మరోవైపు గృహప్రవేశ ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. సుమారు 25 వేల మందికి విందు భోజనాల ఏర్పాట్లు చేశారు. ఇందుకు అవసరమైన ప్రత్యేకమైన షెడ్లను నూతన గృహ పరిసరాలలో నిర్మించారు. శనివారం రాత్రి ఇంటి వద్ద బంధుమిత్రులకు, వీఐపీలకు భోజనాలు చేసి వడ్డించారు. ఆదివారం మధ్యాహ్నం వేల సంఖ్యలో ప్రజలకు భోజనాలు చేశారు. వీవీఐపీ, వీఐపీ, సాధారణ గ్యాలరీలను ఇందుకోసం సిద్ధం చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచే వంట ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నారా భువనేశ్వరి దగ్గరుండి మరీ వంటకాలను సిద్ధం చేయించడమే కాక, అవసరమైన ఏర్పాట్లు చూసుకుంటున్నారు. 25 వేలమంది సాధారణ ప్రజలకు, 2 వేలమంది వీఐపీలకు భోజనాలు వండి వడ్డించారు.

ఇంటింటికీ ఆహ్వాన పత్రిక

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గృహప్రవేశం సందర్భంగా 20 రోజుల క్రితమే నారావారి గహప్రవేశం ఆహ్వానం పేరుతో నియోజకవర్గంలోని కుప్పం, రామకుప్పం, శాంతిపురం, గుడిపల్లి మండలాల్లోని ప్రజలకు ఇంటింటికి ఆహ్వాన పత్రిక కార్యకర్తల ద్వారా అందించారు. ఆదివారం జరిగిన గహప్రవేశ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు వేలాదిగా తరలించారు. వారి కోసం మూడు ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసి అందులో 12రకాల అల్పాహారం విందు, 24 రకాల భోజనాలు వడ్డించారు. అనంతరం చంద్రబాబు నాయుడు నియోజకవర్గం ప్రజల నుంచి సమస్యలతో కూడిన అర్జీలు స్వీకరించారు. నూతనంగా నిర్మించిన ఇంటిలోనే కుప్పం డెవలప్మెంట్ అథారిటీ అధికారులతో నియోజక అభివద్ధిపై సమావేశమయ్యారు. అనంతరం టిడిపి కుప్పం శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. వచ్చిన అశేష ప్రజానీకం ముఖ్యమంత్రి గారి దంపతులతో ఫోటోలు దిగడం మరపురాని జ్ఞాపకంగా వారి హృదయాలలో నిలుపుకున్నారు. కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి ప్రసాదాలను ఆలయ ఈవో పెంచల కిషోర్ సిఎంకు అందించగా అనంతరం వేద పండితులు ఆశీర్వాదం చేశారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, డిఎఫ్ఓ భరణిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి నూతన సొంతింటి వద్ద భద్రతా ఏర్పాట్లను అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పర్యవేక్షించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సిఎం సొంతింటి గృహప్రవేశ ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. ముఖ్యమంత్రి దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో చిత్తూరు ఎంపీ దుగ్గిమళ్ల ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్నాథరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీ మోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివాని శ్రీనివాసులు, నాయకులు డాక్టర్ సురేష్ బాబు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వర్ల రామయ్యను కలిసిన సుగుణమ్మ



టిడిపి పొలిట్ బ్యూరో వర్ల రామయ్యకు స్వాగతం పలుకుతున్న సుగుణమ్మ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి విచ్చేసిన పొలిట్ బ్యూరో సభ్యులు, తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల చైర్మన్ వర్ల రామయ్యను ఆదివారం ఎపిజి అండ్ బిసి ఛైర్‌పర్సన్, తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ హోటల్ కెన్సెస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆమె వెంట తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, చినబాబు, రాష్ట్ర నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, బి.జి. కృష్ణ యాదవ్, జయరాం రెడ్డి, వాలముని, ముని శేఖర్ రాయల్, సుబ్బయ్య, నాగరాజు, రేవతి, నీలిమ, తరుణశ్రీ, సుజాతమ్మ తదితర నాయకులున్నారు.

ముక్కంటి సేవలో గాయని స్మిత



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రముఖ గాయని స్మిత ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

ట్రంప్ సుంకాలపై మోడీ స్పందించాలి

జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సిపిఎం రాష్ట్ర నేతలు వి.వెంకటేశ్వర్లు,మూలం రమేష్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే విధంగా విధించిన సుంకాలపై మోడీ స్పందించాలని ఆదివారం యశోదానగర్, వేమన విజ్ఞాన కేంద్రంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మూలం రమేష్ డిమాండ్ చేశారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు భారత దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని, తద్వారా మన ఆర్థిక వ్యవస్థ అమెరికాపై ఆధారపడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంపు విధానాలపై మోడీ మౌనం దేశానికి హానికరమని విమర్శించారు. విశాఖ ఉక్కు స్టీల్ ఫ్యాక్టరీని పరిరక్షిస్తామని కూటమి నేతలు చెబుతూనే నాలుగు వేలమంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తున్నారని విమర్శించారు. కార్మికుల తొలగింపుపై కూటమి నేతలు ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి పథకాన్ని సంవత్సరానికి 200 రోజులకు పొడిగించాలని, రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాష్ట్రంలో సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ శ్రీ సిటీలో బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. రాబోయే రోజుల్లో జిల్లావ్యాప్తంగా భూ సమస్యలు, ఇంటి స్థలాల సమస్యలు, ఇంటి పట్టాలు, గ్రామీణ ఉపాధి కార్మికుల సమస్యలపై, టీటీడీలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికుల సమస్యలపై, తిరుపతిలో పారిశుద్ధ్య సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రహ్మణ్యం, అంగేరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌వద్ద ఆల్ ట్రేడ్ యూనియన్ ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సోమవారం తిరపతి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టనున్నరు. మే 20వ తేదీ నుండి వైజాగ్ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు అక్రమ తొలగింపులకు నిరసనగా ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయొద్దని సొంత గనులు కేటాయించాలని నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఆ సమ్మెకు మద్దతుగా రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ ఆఫీసుల వద్ద నిరసన తెలియజేయలని రాష్ట్ర సంఘాలు పిలుపు నిచ్చాయి. అందులో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టియుసిల నాయకత్వంలో నిరసన ప్రదర్శన జరుగనుంది. ప్రతి కార్మికుడు నిరసన ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా నాయకులు పిలుపునిచ్చారు.

వెంకటలక్ష్మికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్రం పరిశోధక విద్యార్థి బిళ్ళ వెంకటలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సిఈ రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్రం విభాగాధిపతి ఆచార్య బివి. మురళీధర్ పర్యవేక్షణలో 'భారతదేశ విదేశాంగ విధానంలో ఎన్‌డీఏ పాలనలో పొరుగు దేశాల పట్ల కొనసాగింపు మరియు మార్పులు' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, సహోద్యోగులు, ఆమెకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

సాంకేతికతతో వినియోగదారుడుకి పూర్తి సౌలభ్యం

మోసాలకు తావివ్వకుండా వినియోగదారులకు సేవలు అందించాలి : ప్రజాశక్తితో లీగల్ మెట్రాలజీ ఏసి స్వామి

ముఖా ముఖి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మారుతున్న కాలానుగుణంగా అందుబాటులోకి వచ్చిన సాంకేతికతతో వినియోగదారుడుకి పూర్తి సౌలభ్యమైన, నాణ్యమైన సేవలు అందుకుంటున్నారని, వినియోగదారుడుకి నష్టం కలిగించేలా ఏదేని కుట్రపూరిత మోసాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తున్నామని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి తెలిపారు. సాంకేతికత రాక మునుపు వినియోగదారుడికి సౌలభ్యమైన సేవలలో పలు మోసాలు జరిగేవని, ఆ సమయంలో కూడా వినియోగదారుడుకి నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంగా సున్నమైన తనిఖీలను నిర్వహించి, కట్టుదిట్టమైన చర్యలను చేపట్టామని తెలిపారు. ప్రతి వినియోగదారుడు తన హక్కుగా కొన్ని విషయాలను తెలుసుకోగలిగితే నాణ్యమైన సేవలను కచ్చితంగా పొందగలుగుతాడన్నారు. ఇందుకోసం ప్రతి ఏటా ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని నిర్వహిస్తూ, వివిధ వ్యాపారాలకు సంబంధించి వ్యాపారస్తులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి వినియోగదారుడికి అందించే సేవలపట్ల వ్యవహరించాల్సిన పద్ధతులను ఆయా యాజమాన్యాలకు, నిర్వాహకులకు సూచిస్తామని తెలిపారు.

ప్రజాశక్తి: లీగల్ మెట్రాలజీ విభాగం ద్వారా జిల్లాలో నెలవారీగా చేపట్టే కార్యక్రమాలను వివరించండి?

ఏసీ స్వామి: లీగల్ మెట్రాలజీ విభాగం నెల వారి కార్యక్రమాల్లో భాగంగా వివిధ వ్యాపార సంస్థలకు సంబంధించి తూనికలు, కొలతలు, వాటి పరికరాలకు సంబంధించి పరిశీలన చేస్తాము. నిబంధనల మేరకు అన్ని సవ్యంగా ఉన్నాయా లేదా అని పరిశీలించి వెరిఫికేషన్ అండ్ స్టాంపింగ్ ఫీజును ప్రభుత్వానికి ఆన్లైన్ ద్వారా చెల్లించి వారికి సర్టిఫికెట్ను జారీ చేస్తాం. కాటా రాళ్లలో, ప్యాకేజ్ డిక్లరేషన్లలో ఏదైనా తేడాలు ఉంటే ఆ వ్యాపారికి సంబంధించి కాంపౌండింగ్ ఫీజును ఆన్లైన్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించారా నిర్వాహకులకు సూచిస్తాము.

ప్రజాశక్తి: వినియోగదారులు ప్రామాణికంగా కొనుగోలు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించండి?

ఏసి స్వామి: ప్రతి వినియోగదారుడు తాను కొనుగోలు చేయాల్సిన వస్తువులకు సంబంధించి కాటా లేదా ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంలో మొదట జీరో ఉండేలా పరిశీలించాలి. ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంలో ఏదైనా పళ్ళెం పెట్టినా కూడా జీరో ఉండాలి. తాను ఎంతైతే వస్తువు కొనదలుచుకున్నాడో వినియోగదారుడు ఆ తూకంకు సంబంధించి పరిశీలన చేయాలి.

ప్రజాశక్తి: ఇటీవల కాలంలో లీగల్ మెట్రాలజీ పరిధిలోకి వచ్చే వినియోగదారుల సేవల్లో ఎక్కువ భాగం దేనికి సంబంధించి తనిఖీలను నిర్వహించారు?, తనిఖీలలో బయటపడ్డ అవినీతిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

ఏసి స్వామి: సాధారణంగా వివిధ వ్యాపారాలకు సంబంధించి ఎంఆర్పి ధరలు, ప్యాకేజ్ డిక్లరేషన్ కేసులు, పెట్రోల్ బంకుల్లో ఐదు లీటర్ల క్యాన్లకు లీగల్ మెట్రాలజీ విభాగం ద్వారా ముద్రలు లేకపోవడం, అలానే సూపర్ మార్కెట్లు, కిరాణా షాపులు, బంగారం షాపులు, వ్యవసాయ రైతులు, పాడి రైతులు వినియోగించే వస్తు సేవల్లో ఉపయోగించే తూనికలు వంటి వాటిపై క్రమంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. చౌక దుకాణ షాపూర్ లో 5 కేజీల కన్నా తక్కువ తూకం వేస్తే కేసులు రాస్తున్నాం. ఇవి సాధారణంతో పాటుగా ఆకస్మికంగా కూడా లీగల్ మెట్రాలజీ విభాగం ద్వారా తనిఖీలు నిర్వహించబడతాయి.

ప్రజాశక్తి: మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా వినియోగదారుడికి సౌలభ్యమైన సేవలు అందుతున్నాయా?

ఏసీ స్వామి: వినియోగదారుడు వస్తు ప్రస్తుతం అంది వచ్చిన సాంకేతికతను వినియోగిస్తూ 100 శాతం నాణ్యమైన సేవలను అందివ్వగలుగుతున్నాం. తూనికలకు సంబంధించి క్యాలిక్యులేటింగ్ డేటా సేవింగ్ ఉండడంతో ఏదైనా డేటాకు సంబంధించి మార్పు చేయాలని ప్రయత్నం చేస్తే తనిఖీలలో కచ్చితంగా అది బయటపడుతుంది. తనిఖీ జరిగిన ప్రతిసారి డేటాకు సంబంధించి ఆ వ్యాపార నిర్వాహకుడికి లీగల్ మెట్రాలజీ విభాగం ధ్రువపత్రాన్ని అందిస్తుంది. ఆ ధ్రువ పత్రంలో ఉన్న డేటాకు, తరువాతే డేటాకు వ్యత్యాసాన్ని తప్పకుండా పరిశీలిస్తాం. ఏదేని మార్పు చేసి ఉంటే తప్పకుండా కేసులు నమోదు చేయడం జరుగుతుంది. పెట్రోల్ బంకుల విషయానికి వస్తే పెట్రోల్ అందించే యంత్రానికి సంబంధించి మదర్ బోర్డు మార్పు చేయాలని ప్రయత్నం చేసిన ఇప్పుడున్న టెక్నాలజీ ప్రకారం ఆ మెషిన్ ఆ మదర్ బోర్డ్ కు అనుమతి ఇవ్వదు. పెట్రోల్ అందించే ప్రతి యంత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాం, ఆ సమయంలో ఏదైనా సీల్ నెంబర్ మారితే ఆ యంత్రం నుండి పెట్రోలు అమ్మడానికి వీలు లేకుండా "నో సేల్ బోర్డు" ఏర్పాటు చేస్తాం. ఆ సమయంలో కాంపౌండింగ్ ఫీజును విభాగానికి చెల్లిస్తేనే ఆ యంత్రాన్ని వినియోగించడానికి అనుమతులు జారీ చేస్తాం. కాంపౌండింగ్ ఫీజు రూ 10 వేల నుండి రూ.50 వేల వరకు ఉంటుంది.

ప్రజాశక్తి: గృహ వినియోగ గ్యాసు సిలిండర్, వ్యాపార వినియోగ్యాసు సిలిండర్లకు సంబంధించి వినియోగదారుడు ఎటువంటి పరిశీలన చర్యలు తీసుకోవాలి?

ఏసి స్వామి: సాధారణంగా గృహ వినియోగ గ్యాసు 14.2 రెండు కేజీలు, వ్యాపార వినియోగ గ్యాస్ 19 కేజీలు ఉండాలి. వ్యాపార వినియోగ గ్యాస్ సిలిండర్ పై ఎంఆర్పి, ప్యాకింగ్ తేదీ స్టిక్కర్ రూపంలో తప్పనిసరిగా ఉండాలి. అలా లేని పక్షంలో సంబంధిత సరఫరా సంస్థపై కేసు నమోదు చేయడం జరుగుతుంది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ పై వినియోగదారుడు కి ఏదైనా అనుమానం వస్తే సరఫరా చేసే వాహనంలో స్ప్రింగ్ బ్యాలెన్స్ టైపు తూకం యంత్రంతో వినియోగదారుడు ముందు కచ్చితంగా తూకాన్ని చూపించి ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రజాశక్తి: డిజిటల్ తూకాల ద్వారా పూర్తిస్థాయిలో మోసాలకు అడ్డుకట్ట వేయగలమా?

ఏసి స్వామి: డిజిటల్ తూకాల ద్వారా వినియోగదారుడు వస్తు సేవలో నాణ్యత పెరిగింది. పెట్రోల్ బంకుల్లో రీ వెరిఫికేషన్ స్టాంపింగ్ టైం దాటిపోతే కేసులు నమోదు చేస్తాం. ఇటీవల నాయుడుపేట ప్రాంతంలో ఇలాంటి తనిఖీ జరిపి రీ వెరిఫికేషన్ స్టాంపింగ్ టైం దాటిపోవడంతో ఆ బంకు నిర్వాహకుడికి రూ.50 వేల రూపాయల కాంపౌంటింగ్ ఫీజును విధించాం.

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ 2025 పరీక్షా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ 2025 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పి.జి కళాశాల, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కాలేజీ అఫ్ సైన్స్ పరీక్ష కేంద్రాలను స్టేట్ అబ్జర్వర్, జిల్లా ప్రతేక అధికారి కోన శశిధర్, జాయింట్ సెక్రటరీ ఎస్.జి అజ్మీరా, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 5261 మంది అభ్యర్ధులకు గాను 2941 (55.90 %) మంది అభ్యర్థులు హాజరయ్యారని, 2320 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే మధ్యాహ్నం పరీక్షలకు మొత్తం 5261 మంది అభ్యర్ధులకు గాను 2929 (55.67 %) మంది అభ్యర్థులు హాజరయ్యారని, 2332 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.



యూపీఎస్సీ పరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్, జిల్లా కలెక్టర్

ట్రాఫిక్ పోలీసులకు టోపీల పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వేసవిని దృష్టిలో ఉంచుకొని టిడిపి నాయకులు తిరుపతి ట్రాఫిక్ పోలీసులకు టోపీలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకురాలు, చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి పి.హేమలత తిరుపతి ట్రాఫిక్ స్టేషన్ను సందర్శించారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆచారి, ట్రాఫిక్ సిఐ సమక్షంలో ఆమె ట్రాఫిక్ పోలీసులకు టోపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో తీవ్ర ఎండ మధ్య రోడ్లపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని చేపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి -ఏర్పేడు: శ్రీకాళహస్తి ఎంజీఎం హాస్పిటల్స్, రెడ్ క్రాస్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం, బండారుపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న దాదాపు 200 మందికి పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఈ వైద్య శిబిరంలో ఎంజీఎం హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ వివేక్ చైతన్య, డాక్టర్ ఉమామహేశ్వర్ రావు, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ అర్చన, హాస్పిటల్స్ సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలో శ్రీకృష్ణ ద్రౌపతి దేవి ధర్మరాజుల స్వామి 51 వ వార్షిక బ్రహ్మోత్సవ గోడ పత్రికను ఆదివారం పాత వీరాపురం గ్రామంలో పెద్దలు, నాయకులచే ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాత వీరాపురం గ్రామ సర్పంచ్ మంజుల, మాజీ జడ్పిటిసి ముని రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొంగర కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు మనోహర్ రెడ్డి, బలరాం రెడ్డి, భూలక్ష్మి, గంగమ్మ, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం, జనసేన పార్టీ ఇంచార్జ్ కొప్పుల లావణ్య కుమార్ ఆదేశాలు మేరకు బుచ్చినాయుడు కండ్రిగ మండల అధ్యక్షుడు బాషా ఆధ్వర్యంలో కాటూరులో ఆదివారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ డిప్యూటీ సిఎం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు పార్టీ కోసం కష్టపడే వారికికి, వారి కుటుంబ సభ్యులకి భరోసా ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి గురవయ్య, సంయుక్త కార్యదర్సులు మురళి, లతీష్, వేలు తదితరులు పాల్గొన్నారు.

మేకల తిరుమలరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: టీడీపీ అభివృద్ధికి, విజయానికి కష్టపడిన కార్యకర్తలకే మంచి గుర్తింపు, పదవులు అధిష్టానం కట్టబెడుతుందని నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు సుగుణ పేర్కొన్నారు. ఆదివారం మండలం తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడుగా రెండవ సారి ఎన్నికైన మేకల తిరుమల రెడ్డిని ప్రసన్న వెంకటేశ్వరపురం, వెంకట్రామాపురం పంచాయతీల టిడిపి నాయకులు, యువత, మహిళలు, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల రైతు ప్రధాన కార్యదర్శి బి. నర్సింహారెడ్డి, రాయలచెరువు నీటి సంఘం ఉపాధ్యక్షులు త్యాగరాజులు, యూనిట్ కో ఇన్చార్జ్ టి.రాజేష్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో రాష్ట్ర స్థాయిలో లాస్య

ప్రజాశక్తి-కోట : గుంటూరు జిల్లా, తెనాలి, ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి కరాటే పోటీలను విక్టోరియా షార్ట్కట్ కరాటే అసోసియేషన్ డూ ఇండియా వారు నిర్వహించారు. ఇంటర్ స్టేట్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2025 కార్యక్రమంలో భాగంగా కోట మండలం, చెందోడు శ్రీ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని ముప్పవరపు వెంకట లాస్య కట ఈవెంట్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. నిర్వాహకులు మంగళగిరి ఎస్.పి బల్లి రవిచంద్ర చేతుల మీదగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకుంది.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నడకతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ప్రముఖ న్యాయవాది సంజీవి తెలిపారు. ఆదివారం వాకర్స్ అసోసియేషన్ భవనంలో వాకర్స్ అధ్యక్షులు కేఎల్ఎం మూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాకర్స్ నడిచే సమయంలో రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ నడకతో బీపీ షుగర్ ఉండే జబ్బులు వంటి వ్యాధులు నివారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ గవర్నర్ రావుల మాధవ నాయుడు, కార్యదర్శి మునికృష్ణయ్య, కార్యనిర్వహణ కార్యదర్శి రఫీ అహ్మద్, గోపికృష్ణ, మురుగే రెడ్డి, చిన్న, కుప్పయ్య శెట్టి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో పలువురు లబ్ధిదారులకు సిఎం ఆర్ఎఫ్ నుండి మెడికల్ బిల్లులు మంజూరయిన చెక్కులను నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదివారం పంపిణీ చేశారు. నగరి మున్సిపాలిటీ చింతల పట్టెడకు చెందిన ఎ.ఎస్.సెల్వంకు రూ. 1,62,000/– లు, ఆర్.డి.ఏకనాధన్కు రూ. 13,500/– లు, ఏ.డి.ఇంద్రాణికి రూ. 15000/–లు ఏకాంబర కుప్పంకు చెందిన ఎస్.బి ఢిల్లీరాణికి రూ.1,00,204/– వడమాలపేట మండలం వడమాలకు చెందిన కే.విజయ శంకర్కు రూ. 20,914/– లు, విజయపురం మండలం సి.ఎన్ కండ్రిగకు చెందిన ఆనంద నాయుడుకు రూ.1, 56,346 /– లు. మొత్తం 6 మందికి రూ. 4,67,964/– లు పంపిణీ చేశారు.

మెగా శాఖాహార ర్యాలీ విజయవంతం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులోని త్రినేత్ర పిరమిడ్ దివ్య ధ్యాన కేంద్రం సభ్యులు మెగా శాఖాహార ర్యాలీ ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ ర్యాలీలో పత్రీజి ఆశయాల సాధనకు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాలోని 108 పిరమిడ్ కేంద్రాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కరుణిక సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. స్థానిక విజయలక్ష్మి డిగ్రీ కాలేజీ ఆవరణలో కరుణీక సంఘం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదివారం ఘనంగా సత్కరించింది. భవిష్యత్తులో కూడా ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులు మరింత ముందుకు వెళ్లేందుకు ప్రోత్సాహకాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.ఏ.మునిసురేష్ పిళ్ళై, కె. విశ్వనాధ పిళ్ళై, పి.చంద్రశేఖర్, పి.ఎస్. ప్రకాష్, కె.ఉమా శంకర్, కె. దామోధరం, యు.రజనీకాంత్, కె. శ్యామ్ రాజ, చరణ్, యు.వసంత్ కుమార్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం గున్నం రెడ్డి సేవా భరోసా ద్వారా, సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ప్రజేంద్ర రెడ్డి మాట్లాడుతూ గున్నం రెడ్డి మధుసూదన్ రెడ్డి, రెడ్డి సంఘా నికే కాకుండా ఓజిలి మండలం బట్ల కనుపూర్ గ్రామంలో విద్య పరంగా, ఆధ్యాత్మిక పరంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గున్నం సేవా ట్రస్ట్ ప్రతినిధి బచ్చల రాజేష్ రెడ్డి, రాఘవరెడ్డి, దేగపూడి కిషోర్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి, వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హాస్పిటల్ కమిటీపై తుది నిర్ణయం ఎమ్మెల్యేదే

ప్రజాశక్తి - నాయుడుపేట: హాస్పిటల్ కమిటీపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది ఎమ్మెల్యే అని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీదూరు చంద్రకళ పేర్కొన్నారు. శుక్రవారం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పైఅధికారుల ఆధ్వర్యంలో జరిగిన విచారణపై ఆమె ఈ విధంగా స్పందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్పై వస్తున్న ఆరోపణల విషయమై డైరెక్టర్ ఆఫ్ సెకండరీ ఆరోగ్య శాఖ విజయవాడ వారి ఆధ్వర్యంలో డాక్టర్ భాగ్యలక్ష్మి విచారణ అధికారిగా తన బృందంతో నాయుడుపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళ హాస్పిటల్ కమిటీని నియమించకపోవడంతో హాస్పిటల్ అభివృద్ధి కోసం కేటాయించిన 7.5 లక్షల ఫండ్స్ వెనక్కి వెళ్లిపోయినట్లు ఆమెపై ఆరోపణలు వెలువడ్డాయి. దీనిపై ఆమెను వివరణ కోరగా కమిటీకి సంబంధించిన ప్రపోజల్ ఆరు నెలల ముందే (అక్టోబర్ 2024లో) సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి పంపడం జరిగిందని, హాస్పిటల్ చైర్మన్ ఎమ్మెల్యేనే కావడంతో, ఆమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారు. హాస్పిటల్ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే సూచించిన కొన్ని పేర్లు కొంత ఇబ్బందికరంగా ఉన్నాయని, వాటిని ఆమె దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఆమె ఆలోచించి తర్వాత నిర్ణయం తీసుకుంటానని తెలిపారన్నారు. ఆ తర్వాత కూడా హాస్పిటల్ కమిటీ కోసం ఎమ్మెల్యేను పలుమార్లు కలవడం జరిగిందని, అయినప్పటికీ ఆమె నుంచి సరైన స్పందన రాలేదన్నారు. హాస్పిటల్ సూపరిటెండెంట్గా నా బాధ్యతను నేను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తున్నానని, హాస్పిటల్లోని కొంత మంది ఆదాయానికి నేను అడ్డుగా ఉండటంతో నాపై అనవసరమైన వదంతులు రేపుతున్నారని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని చెప్పారు. శుక్రవారం విచారణ చేపట్టిన డాక్టర్ భాగ్యలక్ష్మి కమిటీ కూడా నాపై వస్తున్న ఆరోపణలు కేవలం కల్పితాలని తేల్చారని, ఈ విషయం ప్రతి ఒక్కరు గమనించాలని కోరారు.


డాక్టర్ మీదూరు చంద్రకళ


ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

డాక్టర్ చంద్రకళ చెబుతున్నవి అవాస్తవాలు :ఎమ్మెల్యే

నాయుడుపేట ప్రభుత్వాసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ చంద్రకళ చెబుతున్నవి అవాస్తవాలని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవలవిజయశ్రీ అన్నారు. డాక్టర్ చంద్రకళ హాస్పిటల్ కమిటీ విషయంలో ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే విజయశ్రీని వివరణ కోరగా ఇలా స్పందించారు. ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో రెండు మున్సిపాలిటీలు ఉన్నాయని రెండు మునిసిపాలిటీల్లోనూ రెండు ప్రధాన సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన అనంతి కాలంలోనే సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో కమిటీ ఏర్పాటు చేశామని, ఆ కమిటీ విజయవంతంగా కార్యకలాపాలు కొనసాగిస్తూ హాస్పిటల్ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతోందని తెలిపారు. నాయుడుపేట డాక్టర్ చంద్రకళ కమిటీ విషయంలో ఆరు నెలల ముందు ప్రపోజల్ పెట్టిన మాట వాస్తవమేనని, అప్పుడే కమిటీ మెంబర్లను కూడా సూచించడం జరిగిందని అయినప్పటికీ ఆమె అనవసరమైన కారణాలు చెప్పి కమిటీ ఏర్పాటు చేయకుండా ఆలస్యం చేస్తూ వస్తున్నారని తెలిపారు. నాయుడుపేట హాస్పిటల్లో అనేక సమస్యలు మా దృష్టికి వచ్చాయని, సూపరింటెండెంట్పై కూడా ఇప్పటికే చాలా ఆరోపణలు ఉన్నాయని గవర్నమెంట్ హాస్పిటల్ పై దృష్టి సారించి హాస్పిటల్లోని సమస్యలను పరిష్కరిస్తామని త్వరలోనే కమిటీని నియమిస్తామని తెలియజేశారు.

ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు: మునీశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎంతో నమ్మకస్తులుగా వైసీపీలో మెలిగి టీడీపీ కోవర్టుగా సమాచారం చేరవేస్తూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక టీడీపీలోకి చేరిన చంద్రగిరి నియోజకవర్గంలోని వైఎస్ఆర్సిపి ఇంటి దొంగలను బయట పెట్టినందుకు ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని వైసిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవర్టులుగా పనిచేసి, నమ్మక ద్రోహం చేసినవారు ఏ రాజకీయ పార్టీలో కూడా స్థానాన్ని సంపాదించుకోలేనంత సహాయాన్ని టిడిపికి అందించారన్నారు. ఇటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన వారు చర్చించుకుంటున్నారన్నారు. వారితో కలిసి వైసిపిలో పనిచేసిన వారంతా కూడా ఇప్పుడు షాక్కు గురయ్యారన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు దామినేటి కేశవులు, మోహన్ యాదవ్, శివ, కోటి, ధరణి పాల్గొన్నారు.



వైసీపీ నుండి టీడీపీలో చేరిన వారి వివరాలను తెలుపుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని వీడియోను చూపుతున్న వైసిపి నాయకులు

అంజూర్ అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధి, బిఎం కండ్రిగ మండలం, సర్వేనెంబర్ 295లోని 21 ఎకరాల అంజూర్ అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కడప జిల్లాలోని సీకే దీన్నేలో వైసిపి నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి ఆక్రమించుకున్న అటవీ భూమిని, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించుకున్న అటవీ భూమిని ఎలాగైతే ప్రభుత్వం స్వాధీన పరుచుకోవడానికి చర్యలు తీసుకుందో, అలానే 21 ఎకరాల అంజూర్ అటవీ భూమిని ఆక్రమించుకొని విలాసవంతమైన భవనాలను కట్టుకున్న కల్కి ఆశ్రమ నిర్వాహకుల నుండి ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకోవాలని కోరారు. 20 ఏళ్ల పోరాట ఫలితం జాయింట్ సర్వేకు ప్రభుత్వం చర్య తీసుకోవడం శుభపరిణామని, అయితే ఈ సర్వేలో రెవెన్యూ అధికారులు, అటవీశాఖ అధికారులు కల్కి ట్రస్టు నిర్వాహకులకు వత్తాసు పలుకుతూ, వారికే భూమి కట్టపెట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జాయింట్ సర్వేకు వచ్చిన అధికారులలో లంచం తీసుకొని ఇది వరకే విధుల నుండి సస్పెండ్ అయిన వారు కూడా ఉండడంతో ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా జాయింట్ సర్వే చేసి అటవీ శాఖకు చెందిన 21 ఎకరాల భూమిని ప్రభుత్వ పరం చేసుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాజేశ్వరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

ఎమ్ఎఫ్ నూతన కమిటీలో నగరి నియోజకవర్గానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ సృష్టి కర్త, ప్రధాన కార్యదర్శి డిల్లిబాబు రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి జిల్లా నూతన కమిటి ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో నగరి నియోజకవర్గం నుండి పుత్తూరుకి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సి.వి.ప్రసాద్ వర్మ వైస్ ప్రెసిడెంట్ గాఎన్నికైయ్యారు. అలాగే ఈసి మెంబర్లుగా పుత్తూరు చెందిన టి లోకేష్, నగరి చెందిన కె.బాలాజీ (సిటీ కేబుల్)లు ఎన్నుకున్నారని ఏ పి ఎమ్ ఎఫ్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి ఢిల్లీ బాబు రెడ్డి తెలియజేశారు.

దారా బ్రదర్స్ రెస్టారెంట్ ప్రారంభించిన నెలవల

ప్రజాశక్తి - నాయుడుపేట: దారా వారంటే మాకు అత్యంత ఆప్తులని వాళ్లంటే మాకు మంచి అభిమానం ఉందని వాళ్ల కుటుంబ సభ్యుడైన ధారా రాజేష్ చిన్న చిన్న షాపుల నుంచి ఎదుగుతూ ఇప్పుడు ఈరోజు ఇంత పెద్ద రెస్టారెంట్ ప్రారంభించడం ఆనందంగా ఉందని సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపులో పాత ఉపఖజానా శాఖ కార్యాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన దారా బ్రదర్స్ రెస్టారెంట్ ను నెలవల సుబ్రహ్మణ్యం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దారా ఫాస్ట్ ఫుడ్స్ ద్వారా మంచి పేరు సంపాదించుకున్న రెస్టారెంట్ యజమాని దారా రాజేష్ ఇంతకుముందు కన్నా ఇప్పుడు మరింత బాధ్యతగా ఉండాలని, పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన ఆహార పదార్థాలను అందిస్తూ ప్రజల అభిమానాన్ని చురగొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బందెల సాయి, దారా లక్ష్మణ్ కుమార్, తిరునామల్లి గౌతమ్, పట్టణ ప్రజలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఘనంగా శాప్ చైర్మన్ జన్మదిన వేడుకలు





ప్రజాశక్తి - క్యాంపస్ : టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో యంఆర్ పల్లి 20వ డివిజన్ వైకుంఠపురం ముఖద్వారం వద్ద శాప్ చైర్మన్ రవినాయుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్కు ఘనస్వాగతం పలికి సత్కరించారు. అనంతరం రవినాయుడు చేతులు మీదుగా 500 మంది అన్నార్తులకు, స్థానికులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్, జ్ఞానేష్, విష్ణు, అరవింద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఔనత్యానికి ప్రతీక మహానాడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తెలుగు జాతి ఔనత్యానికి ప్రతీకగా టీడీపీ మహానాడు నిలుస్తుందని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు అన్నారు. కడపలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సారథ్యంలో కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆదివారం జరిగిన సమావేశంలో పిలుపునిచ్చారు. నాటి కాంగ్రెస్ పార్టీ, నేటి వైసిపి నుండి ఎదురైన ప్రతీ సవాలును దీటుగా ఎదుర్కొని, ప్రజా పోరాటాలు చేసి గడచిన నలభై మూడు సంవత్సరాల కాలంలో ఇరవై రెండు సంవత్సరాలు అధికారంలో ఉన్న టీడీపీ తెలుగుజాతి ఆత్మగౌరవం పరిరక్షణకు కృషి చేయడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖ అభివృద్ధికి పాటుపడిన విషయం అక్షర సత్యం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మునిరాజా యాదవ్, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, భాస్కర్, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మ జాతరలో ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం, సాంబయ్యపాలెంలో ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ జాతరలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్తులు ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించారు. పోలేరమ్మ ఆశీస్సులతో గ్రామంలో సుఖశాంతులు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. టిడిపి నేతలు వెంకటాచలం, మునిరాజా నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, ముని రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



పేదలందరికీ సీఎం సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత వైద్యం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సీఎం సహాయ నిధి నుంచి తప్పకుండా సాయం అందుతుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పలువురు లబ్ధిదారులకు రూ. 4.31 లక్షలు సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న పేదలంతా సీఎం సాయాన్ని అందుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

నారా లోకేష్ను కలిసిన కేతన్ శివ ప్రీతమ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గృహప్రవేశం సందర్భంగా కుటుంబ సమేతంగా చేరుకున్నారు. ఆదివారం ఉదయం మంత్రి నారా లోకేష్ను చిత్తూరు మాజీ ఎంపీ డాక్టర్ నారమల్లి శివప్రసాద్ మనవడు విఎం గ్రూప్ అధినేత కేతన్ శివ ప్రీతమ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



రాయల్ ఛాలెంజ్ తిరుచానూరు జట్టుపై స్పార్టన్ వారియర్స్ జట్టు విజయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సిపిఎల్ సీజన్–1 లో అటు బ్యాటింగ్ లోను, ఇటు బౌలింగ్ లోను క్రికెట్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం జరిగిన మ్యాచ్లో రాయల్ చాలెంజ్ తిరుచానూరు జట్టుపై స్పార్టన్ వారియర్స్ జట్టు ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ దిగిన రాయల్ చాలెంజ్ తిరుచానూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 168/8 పరుగులు చేసింది.బ్యాటింగ్ లో షేక్ ఫయాజ్ అలీ నాలుగు సిక్సర్లు,3 ఫోర్లు సాయంతో 57(30) పరుగులు చేశారు. బౌలింగ్లో మాధవ రాయుడు 3 వికెట్లు,సల్మాన్ 2 వికెట్లు,శ్రీకాంత్,దినేష్ వర్మ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 169 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన స్పార్టన్ వారియర్స్ జట్టు 18.2 ఓవర్లలో 170 పరుగుల చేసి విజయం సాధించింది. ఓపెనర్ దినేష్ వర్మ కేవలం 42 బంతులలో 3 సిక్సర్లు, 9 ఫోర్లతో 80 పరుగులతో విజృంభించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.దీంతో స్పార్టన్ వారియర్స్ జట్టు రాయల్ ఛాలెంజ్ తిరుచానూరు జట్టుపై 4 వికెట్ల ఘనవిజయం సాధించింది. బ్యాటింగ్ లో 80 పరుగులు చేసిన దినేష్ వర్మ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఊక విజయకుమార్,వేణుగోపాల్ నాయుడు, దివాకర్ రెడ్డి తదితరులు అందజేశారు.



పాయ్ వైస్రాయ్ జట్టుపై ఆదిత్య జట్టు విజయం

మధ్యాహ్నం జరిగిన మ్యాచ్లో పాయ్ వైస్రాయ్ జట్టుపై ఆదిత్య జట్టు ఘన విజయం సాధించింది.టాస్ గెలిచి బ్యాటింగ్కు దిగిన ఆదిత్య జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేసింది. ఓపెనింగ్ దిగిన అభిషేక్, కళ్యాణ్ 104 భాగస్వామ్యం నెలకొల్పడంతో జట్టు భారీ స్కోరు చేయగలిగింది. అందులో అభిషేక్ 97(56), కళ్యాణ్ 47(26)లతో రాణించారు.196 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన పాయ్ వైస్రాయ్ జట్టు 18.1 ఓవర్లలో 147/10 పరుగులకు ఆల్ అవుట్ అయింది. బ్యాటింగ్ లో చరణ్ జిత్ 45,వెంకటేష్ 26 పరుగులు చేయగా బౌలింగ్ లో సూర్యచరణ్ 3 వికెట్లు, షమీవుల్లా 2, సాయి చరణ్, వినోద్ నాయుడు, ధనుష్ రెడ్డి తలా ఒక వికెట్ తీసుకున్నారు. దీంతో పాయ్ వైస్రాయ్ జట్టుపై ఆదిత్య జట్టు 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్లో 96 పరుగులు చేసిన అభిషేక్ రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కైవసం చేసుకున్నారు.ఈ అవార్డును సిడిసిఏ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసమూర్తి,సెక్రటరీ రవి, కోచ్ మస్తాన్,స్పోర్ట్స్ ఫ్యాక్టరీ దాము తదితరులు అందజేశారు.

నేడు సిపిఎల్-1 లో తలపడనున్న జట్లు

సిపిఎల్ సీజన్ వన్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు పాయ్ వైస్రాయ్ వర్సెస్ స్పార్టన్ వారియర్స్ జట్లు తలపడనున్నాయి.అదేవిధంగా మధ్యాహ్నం 1గంటకు జరిగే మ్యాచ్లో హైపీరియన్ వర్సెస్ రాయల్ చాలెంజ్ తిరుచానూరు జట్లు తలపడతాయి.

క్రైం న్యూస్

దంపతుల మృతిపై అనుమానాలు..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న పద్మ, సురేష్ ల మృతిపై అనుమానాలున్నాయని పద్మ మొదటి భర్త కుమారుడు సాయి తేజ ఆదివారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నాగార్జున రెడ్డి తెలిపారు. సామాజిక మాధ్యమం ద్వారా పరిచయం పెంచుకున్న విశాఖ, అబీద్ నగర్ కు చెందిన పైడి రాజు భార్య పద్మ (40), శ్రీకాళహస్తి పట్టణం కైలాసగిరి కాలనీకి చెందిన సురేష్(30)లు కుటుంబాలతో వేరుపడి స్థానిక కైలాసగిరి కాలనీలోనే గత ఎనిమిది నెలలుగా సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరూ వేరువేరుగా ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో పద్మ మొదటి భర్త కుమారుడు సాయి తేజ వీరిద్దరి మృతి పై అనుమానం వ్యక్తం చేయడంతో కేసులో ప్రాధాన్యత సంతరించుకుంది. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత అసలు నిజాలు బయటకు వస్తాయంటూ పోలీసులు చెబుతున్నారు.

షాపులు శుభ్రం.. దారులు ఛిద్రం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని ప్రముఖ వస్త్ర దుకాణదారులు నిత్యం తమ దుకాణాలను కడిగి, ఆ నీటిని రోడ్డుపై వదులుతుండటంతో, రోడ్డుపై వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. కొందరు ఆ నీటి వల్ల ఏర్పడిన బురదలో జారి పడుతున్నారు. పుత్తూరు –తిరుపతి రోడ్డు మెయిన్ స్కూల్ ఎదురుగా ఉన్న రెండు వస్త్ర దుకాణదారులు ఒకరిపై ఒకరు పోటీ పడి తమ దుకాణాలను ప్రతిరోజు ఉదయం నీటితో శుభ్రం చేసి, ఆ నీటిని రోడ్డుపైకి వదిలేస్తున్నారు. ఈ షాపులే కాక పుత్తూరులో చాలా షాపుల యాజయాన్యాలు ఇలాగే షాపులు శుభ్రం చేసిన నీటిని రోడ్డుపై వదులుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



వెరిటాస్ సైనిక స్కూల్లో ఎన్సిసి శిక్షణ



ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని చుట్టుగుంట రామాపురంలో ఉన్న వెరిటాస్ సైనిక స్కూల్లో ఆదివారం నుండి జూన్ 03 వరకు బహుళ వార్షిక శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు గ్రూప్ కెప్టెన్ కమాండింగ్ ఆఫీసర్ 11(ఎ) ఎయిర్ స్క్వాడ్రన్ (టి) ఎన్సిసి అధికారి ఆర్. ఫోపోలిష్ అన్ (ఆర్జే అత్రే) తెలిపారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్లోని చిత్తూరు తిరుపతి కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల నుండి 700 మంది క్యాడెట్లు (500 మంది బాలురు, 200 మంది బాలికలు) ఈ శిబిరంలో పాల్గొనేందుకు పేర్లను నమోదు చేసుకున్నారని పరిశీలకులు గుణశేఖర్ తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారి లక్ష్మీ నరసింహ, ఉపేందర్ రెడ్డి, ప్రియ, హేమలత, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

సీఎం గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - రామచంద్ర పురం : కుప్పం నియో జకవర్గం, శాంతి పురం మండలం, శివపురం గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు నూతనంగా నిర్మించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఆదివారం శాసనసభ్యులు పులివర్తి నాని, ఎన్ అమర్నాథ్ రెడ్డి, డాక్టర్ మురళీమోహన్, ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చూడా చైర్మన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబులు హాజరైయ్యారు.

భక్తులతో మర్యాదగా వ్యవహరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసే భక్తుల తోటి ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని వన్ టౌన్ సిఐ గోపి ఆటో డ్రైవర్లకు సూచించారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ డ్రైవర్లతో ఆదివారం రాత్రి సిఐ గోపి సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవర్ల చిరునామా, వివరాలు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. భక్తులు రైలు దిగేటప్పుడు బలవంతంగా ఆటోలో ఎక్కించుకునే సాంప్రదాయాన్ని మానుకోవాలని సూచించారు. భక్తుల ఇష్ట ప్రకారం వారి కోరిన అతిథి గృహాల వద్ద దింపాలని తెలిపారు. నిబంధనలు పాటించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమ కట్టడాలు తొలగింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వకాల యంలోని ప్రసాదాల పోటు నుంచి వెళ్లే వ్యర్థ నీరు గొడ్డేరులో కలవ కుండా స్థానిక సన్నిధి వీధిలో నిర్మించిన పలు అక్రమ కట్టడాలను ఆదివారం దేవస్థానం అధికారులు తొలగించారు. ఎవరైనా దేవస్థానానికి అనుబంధంగా ఉన్న స్థలాల్లో అక్రమ కట్టడాలు కడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీఈవో కృష్ణారెడ్డి, సిబ్బంది నాగభూషణం యాదవ్, ప్రతాప్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆదివారం ఉదయం స్థానిక బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం, తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నరసింహ యాదవ్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల, డిప్యూటీ మేయర్ మునికృష్ణ , రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు, సేవా కుటుంబం సభ్యులు సూరా శ్రీదేవి, సరళ, కార్గిల్ యుద్ధ వీరులు మాజీ సైనికులు ఎ.పి నాయుడు, అమర రాజ ప్రతినిధి చంద్ర బాబు, గుర్రప్ప, మార్పు సేవాసంస్థ దళవాయి గుర్రప్ప, ఉపాధ్యాయులు సాంబి రెడ్డి, బాలాజీ, డాక్టర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు వద్ద నిలిచిన గూడ్స్..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు రైల్వే ఆర్డిఎం లిఫ్ట్ గెట్ వద్ద ఆదివారం రాత్రి గూడ్స్ ట్రైన్ సరిగ్గా లిఫ్ట్ గేటు వద్ద వచ్చి ఆగిపోయింది. దీంతో 45 నిమిషాల పాటు వాహన చోదకులకు, ప్రజలకు వేచి చూడాల్సి వచ్చిందని అసహనం వ్యక్తం చేశారు.